'ఆడుదాం..ఆంధ్రా' ఏర్పాట్లు పూర్తిచేయాలి : జెసి

ఏలూరు: ఈనెల 26 నుంచి ప్రారంభం కానున్న ఆడుదాం..ఆంధ్ర క్రీడా పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి ఆదేశించారు. క్రీడా పోటీల సన్నద్ధతపై వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారులతో శనివారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ మేరకు మండలాల వారీగా సన్నద్ధతను ఆమె తెలుసుకున్నారు. అన్ని మండలాల్లో టీం ఫార్మేషన్ పూర్తిచేసుకుని పోటీల నిర్వహణకు సన్నద్ధం కావాలన్నారు. ఉత్సవ వాతావరణంలో నిర్వహించాలని స్పోర్ట్స్ అంబాసిడర్లు ఆయా ప్రాంతాల్లో పాల్గొనేలా చూసుకోవాలన్నారు. ఈనెల 26 నుంచి జనవరి తొమ్మిదో తేదీ వరకూ గ్రామ స్థాయిలో పదో తేదీ నుంచి 23 వరకూ మండల స్థాయిలో, 24 నుండి 30 వరకూ నియోజకవర్గ స్థాయిలో తదుపరి జిల్లాస్థాయిలో పోటీలు జరుగుతాయన్నారు. పోటీలకు నిర్ధేశించిన 318 క్రీడా మైదానాల్లో ఏర్పాట్లను పూర్తిచేసుకోవాలన్నారు. అవగాహనకు ఈనెల 24వ తేదీ ఉదయం 6.30 గంటలకు ఏలూరు సత్రంపాడు సమీపంలో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు నుంచి ఇండోర్ స్టేడియం వరకూ 3కె రన్ నిర్వహించబడుతుందన్నారు.

పండుగకు ధరాఘాతం..!

ఆకాశాన్నంటుతున్న నిత్యావసరాల ధరలు
కందిపప్పు కిలో రూ.175, పెసరపప్పు రూ.125పైనే
వంటనూనె కిలో రూ.120పైమాటే
గ్యాస్ సిలిండర్ ధర రూ.980
కూరగాయల ధరల పరిస్థితీ అదేతీరు
పిండివంటలు, కొత్త బట్టలకు అంతా దూరం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

క్రిస్మస్, సంక్రాంతి పండుగలను సామాన్య ప్రజానీకం సంతోషంగా జరుపుకోలేని పరిస్థితి కన్పిస్తోంది. నిత్యావసర వస్తువులతోపాటు అన్నిరకాల ధరల పెరుగుదల సామాన్య ప్రజానీకాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. సామాన్యులు ఎక్కువగా జరుపుకునే పండుగ క్రిస్మస్, సంక్రాంతి. క్రైస్తవ సోదరులు క్రిస్మస్ పండుగను అత్యంత వైభవంగా జరుపుకోవాలని తహతహలాడతారు. ప్రతిఒక్కరూ తమ బంధువులను పండుగకు ఇంటికి పిలుచుకుని ఆనందంగా గడుపుతారు. పిండివంటలు చేసుకోవడంతోపాటు కొత్త బట్టలు పెద్దఎత్తున కొనుగోలు చేస్తారు. అయితే అందనంత ఎత్తుకు అన్నిరకాల ధరలూ పెరిగిపోవడంతో సామాన్య ప్రజానీకం ఇళ్లలో పండుగ సందడి కానరావడం లేదు. బహిరంగ మార్కెట్లో కిలో కందిపప్పు రూ.180 పలుకుతుండగా, పెసరపప్పు రూ.125, వంటనూనె రూ.120కుపైగా, బెల్లం కిలో రూ.50, మినపప్పు రూ.120 ఇలా అన్ని రకాల ధరలు ఆకాశంలో ఉన్నాయి. మోడీ సర్కార్ వచ్చిన తర్వాత రూ.430 ఉండే గ్యాస్ సిలిండర్ కాస్తా ప్రస్తుతం రూ.980కు చేరింది. ఏదైనా పిండివంట చేయాలంటే తక్కువగా లెక్కించినా రూ.ఐదు వేలు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఉంది. దీంతో పిండి వంట చేసేందుకు సామాన్య ప్రజానీకం ముందుకు అడుగువేయలేని దుస్థితి. క్రిస్మస్‌కు కొత్త బట్టలు ఎక్కువగా కొనుగోలు చేస్తారు. గతంలో రూ.500 పలికే బట్టలు ఇప్పుడు రూ.వెయ్యికి చేరాయి. చిన్న పిల్లల దుస్తులైతే మరింత ధర పలుకుతున్నాయి. దీంతో సంతోషంగా జరుపుకోవాల్సిన పండుగ వేళ సామాన్య కుటుంబాలు నిరాశ, నిస్పృహల నడుమ కొట్టుమిట్టాడుతున్నాయి. కుటుంబం అంతా బట్టలు కొనుగోలు చేసుకోకుండా పిల్లల వరకూ కొనుగోలు చేసి చాలా కుటుంబాలు సర్దుకున్న పరిస్థితి కన్పిస్తోంది. ధరల పెరుగుదలతో పిండివంటలు చేసుకునే అవకాశం లేకపోవడంతో రెడీమేడ్‌గా తయారుచేసిన పిండివంటలను ఏదో కొద్దిగా కొనుగోలు చేసి కాలం గడిపేస్తున్నారు. బంధువులను సైతం పండుగకు పిలవడం మానేశారు. కుటుంబమంతా బట్టలు కొనుగోలు చేసుకుని, పిండి వంటలు వండుకుని సంతోషంగా జరుపుకోవాలంటే ప్రస్తుత ధరలతో కనీసంగా రూ.20వేలు పైనే ఖర్చవుతోంది. అంత ఖర్చు చేసే పరిస్థితిలో సామాన్య కుటుంబాలు లేవు. కూరగాయల ధరలు సైతం విపరీతంగా పెరిగిపోయాయి. కిలో అల్లం రూ.130 పలుకుతుండగా, వంకాయలు కిలో రూ.64, క్యారెట్ కిలో రూ.60, కాకర కిలో రూ.60, చిక్కుడు కిలో రూ.120, బీన్స్ కిలో రూ.74 ఇలా అన్ని రకాల కూరగాయల ధరలు సామాన్యునికి అందనంత ఎత్తుకు ఎగబాకాయి. నిత్యావసరాల ధరలతోపాటు అన్ని వస్తువుల ధరలు పెరగడానికి ప్రధాన కారణం పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెరగిపోవడమే. మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత లీటర్ పెట్రోల్ రూ.120కు చేరువకాగా డీజిల్ రూ.వంద పలుకుతోంది. దీంతో రవాణా ఛార్జీలు విపరీతంగా పెరిగిపోయాయి. దీంతో నిత్యావసర, కూరగాయల ధరలు సైతం అందనంత ఎత్తుకు చేరుకుంటున్నాయి.

తగ్గిన వేతనాలు.. పెరిగిన ధరలు

కరోనా తర్వాత ఉపాధి అవకాశాలు దెబ్బతిని సామాన్య కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఆక్వాతోపాటు అనేక పరిశ్రమల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకూ పని చేసినా రోజుకు రూ.220కు మించి వేతనం ఇవ్వడం లేదు. నెలంతా కష్టపడినా రూ.ఆరు వేలు రావడం గగనంగా మారింది. ఆక్వా చెరువులు పెరిగిపోవడంతో వ్యవసాయ కూలీలకు పనులు తగ్గిపోయాయి. దీంతో ఎంత కూలి ఇస్తే అంతే కూలికి పనికి వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. కుటుంబమంతా కష్టపడితే నెలకు రూ.పది వేలు సంపాదించడం గగనంగా మారింది. ఇలాంటి కుటుంబాలు పెరిగిన ధరలతో రూ.పది వేలు ఖర్చు పెట్టి పండుగను సంతోషంగా ఏవిధంగా జరుపుకుంటాయో ప్రభుత్వాలే చెప్పాల్సి ఉంది. సామాన్యులకు ఉచితంగా ఏదో ఇచ్చేస్తున్నట్లు గొప్పలు చెబుతున్న ప్రభుత్వాలు, ధరల రూపంలో పీల్చిపిప్పి చేస్తున్నాయి. దీంతో ఒకప్పుడు ఎంతో సంతోషంగా జరిగే పండుగలు నేడు వెలవెలబోతున్నాయి.

ముసునూరులో మోకాళ్లపై నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

చెవిలో పువ్వులు.. మోకాళ్లపై నిలబడి

12వ రోజు అంగన్‌వాడీల వినూత్న నిరసన

అంగన్‌వాడీలు 12వ రోజు శనివారం పలుచోట్ల వినూత్నంగా తమ నిరసన తెలిపారు. కలిదిండిలో చెవిలో పూలు పెట్టుకుని, ముసునూరులో మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. జీలుగుమిల్లిలో మెడలో ఎర్రకండువాలు వేసుకుని నినదించారు. ఏలూరులోని సమ్మె శిబిరాన్ని ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు సందర్శించి మద్దతు తెలిపారు. చింతలపూడిలో జరిగిన సమ్మెలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి, ఉంగుటూరులో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు పాల్గొన్నారు. నిడమర్రులో ఐద్వా మండల కమిటీ బృందం సమ్మెకు మద్దతు తెలిపింది. జిల్లాలోని అన్నిమండలాల్లో అంగన్‌వాడీలు విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. -వార్త 6లో..

రైతుల వద్దకే ప్రభుత్వ సేవలు : ఎలిజా

చింతలపూడి : రైతులకు ప్రభుత్వ సేవలను చేరువ చేసేందుకే రైతు భరోసా కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని ఎంఎల్‌ఎ ఉన్నమట్ల ఎలీజా అన్నారు. మండలంలోని శివపురంలో ఆర్‌బికెను ఎంఎల్‌ఎ శనివారం ప్రారంభించారు. అనంతరం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. స్థలదాతలు నరకుళ్ల సత్యనారాయణ, నరకుళ్ల దీపక్‌కు ఎంఎల్‌ఎ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ప్రతీ ఇంటికి వెళ్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శివపురం సర్పంచ్ రోషిణి, రవీంద్ర, శ్రీను పాల్గొన్నారు.

ఉద్యోగులను విస్మరిస్తే పతనమే

సమగ్రశిక్ష ఉద్యోగుల నాలుగో రోజు సమ్మెలో ఎంఎల్‌సి ఐవి

ఏలూరు అర్బన్: స్థానిక కలెక్టరేట్ వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారానికి నాలుగో రోజుకు చేరింది. ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనమివ్వాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ శిబిరాన్ని ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు(ఐవి) సందర్శించి మాట్లాడారు. ఉద్యోగుల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తున్న సిఎం జగన్ త్వరలో ఉద్యోగులే ఇంటికి పంపిస్తారన్నారు. జగన్ తన పాదయాత్ర సందర్భంగా కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తానని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏ ప్రభుత్వమూ శాశ్వతం కాదని, ఎన్నో ప్రభుత్వాలను ఇంటికి పంపించిన చరిత్ర ఉద్యోగులకు ఉందన్నారు. ఇప్పటికే ఆయన మాట తప్పి, మడమ తిప్పారని, ఇక తేల్చుకోవాల్సింది ఉద్యోగులేనన్నారు. ఈ పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు పిఆర్‌సి అమలు చేయకుండా నెలలు తరబడి వేతనాలు విడుదల చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం అన్యాయంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న పార్ట్ టైం విధానాన్ని రద్దుచేసి ఫుల్ టైం కాంట్రాక్టు విధానాన్ని అమలు చేయాలని కోరారు. సమగ్ర శిక్ష జెఎసి నాయకులు భగవాన్, పౌల్ రాజు, క్రాంతి, దిలీప్, బాలాజీ, రాజు సత్య, చినబాబు, వై.శ్రీనివాసరావు, వీరమణి పాల్గొన్నారు.

క్లాప్ డ్రైవర్లను విస్మరించిన ప్రభుత్వం

మూడో రోజుకు రిలే దీక్షలు

ఏలూరు అర్బన్: స్వచ్ఛ సంకల్పం, సుందర నగరాలు, పరిశుభ్ర ఆంధ్రప్రదేశ్ కోసం పాటుపడుతున్న క్లాప్ ఆటోల డ్రైవర్లకు కనీస వేతనాలు చెల్లించకపోవడం దారుణమని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ విమర్శించారు. ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద క్లాప్ ఆటో డ్రైవర్ల మూడో రోజు రిలే నిరాహార దీక్షలను శ్రీనివాస్ ప్రారంభించి మాట్లాడారు. దీక్షలో కూర్చున్న క్లాప్ ఆటోల డ్రైవర్ల మెడలో ఎర్రని రిబ్బన్లు వేసి దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరాలు, పట్టణాలు పరిశుభ్రంగా ఉండడానికి, మున్సిపాలిటీలకు అవార్డులు రావడానికి కారణమైన క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం, అధికారులు పట్టించుకోకపోవడం అన్యాయన్నారు. జిఒ ఏడు ప్రకారం జీతాలు పెంచమని అడిగితే అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. వారాంతపు సెలవులు, పండుగ సెలవులు, క్యాజువల్ లీవులు అమలు చేయకపోవడం చూస్తుంటే వారంతా బానిస సమాజంలో ఉన్నారా? ఆధునిక సమాజంలో ఉన్నారా..? అనేది అర్థం కావడం లేదన్నారు. డ్రైవర్లకు కావాల్సిన గుర్తింపు కార్డులు, యూనిఫారాలు ఇవ్వకుండా కాంట్రాక్టర్లకు కోట్లాది రూపాయలు దోచిపెట్టడం సబబా అని ప్రశ్నించారు. ఈ నెల 26వ తేదీ నుండి చేపడుతున్న క్లాప్ డ్రైవర్లు చేపట్టిన నిరవధిక సమ్మెకు తమ రైతు సంఘం పూర్తి మద్దతు తెలియజేస్తుందన్నారు. ఈ కార్యక్రమానికి క్లాప్ ఆటో డ్రైవర్ల సంఘం నాయకులు పుష్పరాజ్ అధ్యక్షత వహించారు. ఈ రిలే నిరాహార దీక్షలో 18 మంది క్లాప్ ఆటోల డ్రైవర్లు పాల్గొన్నారు. ఈ దీక్షలకు పాత శ్రీను, అచ్యుత్, లోవరాజు, అశోక్ కుమార్, రఘు, యశోదర నాయకత్వహించారు. ఈ దీక్షలకు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు అంగుళూరు జానుబాబు, లావేటి కష్ణారావు, బండిరాజు, పి. చిన్న నాగరాజు, తానంకి జార్జ్, బంగారు వెంకటేశ్వర్లరావు, కాళిదాస్ తదితరులు నాయకత్వం వహించారు.

ఉత్సాహభరితం.. హేలాపురి బాలోత్సవం..!

ఘనంగా ప్రారంభమైన బాలోత్సవం - ఆకట్టుకున్న చిన్నారుల నృత్యాలు

నృత్యం చేస్తున్న విద్యార్థి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రెండు రోజుల పాటు జరిగే హేలాపురి బాలోత్సవం-4 స్థానిక అమీనాపేటలోని శ్రీసురేంద్ర బాహుగుణ స్కూల్లో షేక్ సాబ్జీ స్మారక ప్రాంగణంలో శనివారం ఘనంగా ప్రారంభమైంది. బాలోత్సవ కార్యక్రమాలతో ప్రాంగణమంలో పండుగ వాతావరణం నెలకొంది. ప్రారంభ సూచికగా జాతీయ జెండాను, బాలోత్సవం జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన ప్రారంభ సభకు ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు (ఐవి) మాట్లాడుతూ పిల్లల్లో ప్రతిభను వెలికితీసేందుకు బాలోత్సవం ఎంతగానో దోహదపడుతుందన్నారు. నేటి కంప్యూటర్ యుగంలో పిల్లల్లో ఆటలు, పాటలు, విజ్ఞానదాయక కార్యక్రమాలు కనుమరుగై యాంత్రికంగా తయారవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మార్కులు, ర్యాంకులే కాకుండా సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా భాగస్వామ్యం కావడం వల్ల వారిలో మానసిక పరిపక్వత వస్తుందన్నారు. దేశంలో కేరళలో ముందుగా అక్షరాస్యత ఉద్యమం ప్రజా ఉద్యమంలా సాగిందని, ఆ నేపథ్యంలో కేరళలో పెద్దఎత్తున బాలోత్సవ కార్యక్రమాలు నిర్వహించడం ప్రారంభించారని గుర్తు చేశారు. ఆ స్ఫూర్తితో హేలాపురి బాలోత్సవాలను నిర్వహించడం అభినందనీయ మన్నారు. పిల్లలు అన్నిరంగాల్లోనూ రాణించేలా తల్లిదండ్రులు వారిని ప్రోత్సహించాలని కోరారు. బాలోత్సవ కార్యక్రమాలను విస్తరింపచేసేందుకు అందరూ సహకరించాలని కోరారు.

అల్లూరి వేషధారణలో విద్యార్థి

మరో ముఖ్యఅతిథి డిఇఒ పి.శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదవాలని కోరారు. అప్పుడే వారు లక్ష్యాన్ని చేరుకోగలరని ఆకాంక్షించారు. చదువుతోపాటు సాంస్కృతిక క్రీడాంశాల్లో రాణించడం ద్వారా వారిలో నైపుణ్యం మరింత అభివృద్ధి చెందుతుందని చెప్పారు. మారిన విద్యా పరిస్థితుల్లో పిల్లలు తమ బాల్యాన్ని కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బాల్య జ్ఞాపకాలు జీవితాంతం ఉంటాయని, ఇలాంటి బాలోత్సవాలు మరెన్నో జరగాలని కోరారు. ఉషా బాల సంస్థల అధినేత వివి.బాలకృష్ణారావు మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని దేశం అన్ని రంగాలలోనూ అభివృద్ధి చెందాలంటే అందుకు మూలం చదివేనని చెప్పారు. అన్ని రంగాల్లో పిల్లలు రాణించాలన్నారు. హేలాపురిలో కనుల పండుగగా పిల్లల సంబరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. శ్రీనాగ హనుమాన్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ టెక్నికల్ డైరెక్టర్ టి. భాస్కర్‌లి మాట్లాడుతూ బాలోత్సవాల నిర్వహణ కష్టతరమైనప్పటికీ బాగా నిర్వహిస్తున్నందుకు అభినందనీయమన్నారు. పిల్లల మానసిక వికాసానికి తోడ్పడుతున్న బాలోత్సవాలను మరింత విస్తరింపచేయాలని ఆకాంక్షించారు. కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, జె.సత్యనారాయణరాజు, ఎంఎస్ఎంఎస్.కుమార్, ఎ.నిర్మల, మారుబోయిన కోటేశ్వరరావు, మునగాల మురళీకృష్ణ, కూచిపూడి సత్యనారాయణ, డి.జయబాబు, ఎస్‌కె.ఆలీ, ఎస్.కస్తూరిరావు, ఎం.మంగరాజు, వై.అర్జునరావు, వై.ఆనందనాయుడు, ఎం.కాంతారావు, ఎం.అజయ్‌బాబు, ఎంజిఎన్ వెంకటరత్నం, పలువురు ప్రముఖులు, వేలాది మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అతిథులకు జ్ఞాపికలు అందిస్తున్న నిర్వాహకులు

చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు

అల్లూరి వేషధారణలో విద్యార్థి

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో 'చదవాలిరా ఎన్ని ఆటంకాలొచ్చినా..

చదవాలిరా ఎన్ని ఆటంకాలొచ్చినా' పాటను బాలోత్సవం సందర్భంగా వెయ్యి మందికిపైగా ఒకేసారి ఆలపించడంతో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఈ పాట నమోదైనట్లు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ రాష్ట్ర ప్రతినిధి మువ్వా శ్రీనివాస్ ప్రకటించి సర్టిఫికెట్ ను ఆహ్వాన సంఘ నాయకులకు అందజేశారు.

విద్యార్థులకు 60 రకాల పోటీలు

60 రకాల సాంస్కృతిక, అకాడమిక్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో విద్యార్థులు తమ ప్రతిభను చాటుతున్నారు. జానపద నృత్యం, విచిత్ర వేషధారణ, కోలాటం, శాస్త్రీయ నృత్యం, దేశభక్తి గీతాలాపన, లఘు నాటిక, ఏకపాత్రాభినయం తదితర కల్చరల్ పోటీలతోపాటు క్విజ్ తెలుగులో మాట్లాడడం కథ చెప్పడం వకత్వం చిత్రలేఖనం తదితర అకాడమిక్ పోటీలు జరిగాయి. శాస్త్రీయ నృత్యంలో విద్యార్థుల ప్రదర్శన ఆకట్టుకుంది. విద్యార్థుల కోలాటం, నాటికలు, వ్యక్తిగత, బృందగానం ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా విచిత్ర వేషధారణలో పిట్టలదొర, రైతు, బుడబుక్కలోడు, జంగం దేవర, సోది అమ్మాయి, అడవి మనిషి వేషధారణలు విపరీతంగా ఆకట్టుకున్నాయి.

తారుమారు తక్కెడమారు..!



'తారుమారు తక్కెడమారు.. వీరివీరి గుమ్మడి పండు వీరి పేరేంటీ' అనే చందంగా తయారైంది జిల్లాలో అధికార పార్టీ ఎంఎల్‌ఎ పరిస్థితి. ఎన్నికలు సమీపిస్తున్న వేళ నియోజకవర్గాల ఇన్‌ఛార్జుల మార్పు అధికార పార్టీ వైసిపిలో కలకలం సృష్టిస్తోంది. ఏలూరు జిల్లాలో చింతలపూడి, పోలవరం నియోజకవర్గాల్లో అభ్యర్థులను మారుస్తున్నట్లు వైసిపి అధిష్టానం ఆయా సిట్టింగులకు తేల్చిచెప్పడంతో జిల్లాలో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. చింతలపూడి ఎంఎల్‌ఎ ఎలిజాను ఎంపీ స్థానం నుంచి బరిలోకి దిగాలనడం 'పొమ్మనలేక పొగబెట్టిన' చందంగా తయారైందని ఆ నియోజకవర్గ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. ఇక పోలవరం ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజుకు టిక్కెట్ లేదంటూనే కొత్త అభ్యర్థి ఎవరో సూచించాలనడం ఆ అభ్యర్థి గెలుపు బాధ్యత ఆయనపైనే పెట్టినట్లుగా ఉందని వ్యాఖ్యానిస్తున్నారు. ఏలూరు, ఉంగుటూరు, కైకలూరుల్లోనూ అభ్యర్థులను మార్చే యోచనల్లో వైసిపి అధిష్టానం ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. అదే జరిగితే వైసిపి ఏలూరు జిల్లాలో కొత్త టీమ్‌తో బరిలోకి దిగుతున్నట్లే. ఏలూరులో మైనార్టీ అభ్యర్థికి టిక్కెట్ కేటాయిస్తే ఎలా ఉంటుందోనని.. అభిప్రాయాలు తీసుకుంటున్నట్లు సమాచారం. అదే జరిగితే జగన్ పార్టీ పెట్టకముందు నుంచి అనుచరులుగా ఉన్న తెల్లం బాలరాజు, ఆళ్ల నానికి మొండిచెయ్యి చూపుతారా లేక వేరే పదవులు కట్టబెడతారా అనేది చర్చనీయాంశమైంది. అలాగే ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ కూడా వచ్చే ఎన్నికల్లో బరిలోకి దిగే అవకాశం లేదనే ప్రచారం సాగుతోంది. ఈ క్రమంలో వీరిలో ఎవరినైనా ఎంపీ స్థానానికి బరిలోకి దింపుతారో, కొత్త అభ్యర్థిని రంగంలోకి తీసుకొస్తారో వేచిచూడాలి.

ఇక పశ్చిమగోదావరి జిల్లాలోనూ ఇన్‌ఛార్జుల మార్పుపై చర్చలు సాగుతున్నట్లు సమాచారం. ఆచంట, నరసాపురం సిట్టింగ్ ఎంఎల్‌ఎలను వేరే స్థానాలకు పంపే అవకాశం ఉందనే ప్రచారం సాగుతోంది. అయితే ఇప్పటికే క్షత్రియ సామాజిక తరగతికి మంత్రి పదవులు ఇవ్వకపోవడం, ఇతర కారణాల రీత్యా ఆ మార్పు ఉండదనే ప్రచారమూ మరోపక్క సాగుతోంది. ఇక పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా గుడాల గోపీని ఇటీవలే నియమించినా ఆయనకు టిక్కెట్ దక్కే అవకాశాలు లేవనే ప్రచారం ఉంది. ఇక్కడ మేకా శేషుబాబు, గుణ్ణం నాగబాబు అభ్యర్థిత్వాలు పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే ఉండి టిక్కెట్ నామినేషన్ల ఘట్టం వరకూ సస్పెన్స్‌లో కొనసాగే అవకాశం ఉందని అక్కడి పరిశీలకులు చెబుతున్నారు. ఇక్కడ ఎంపీ అభ్యర్థిగా గోకరాజు కుటుంబం నుంచి ఉంటారనే అంచనాలున్నాయి. అయితే ఇక్కడ కూడా బలమైన అభ్యర్థిని బరిలోకి దింపేందుకు కసరత్తు చేస్తున్నట్లు ప్రచారం ఉంది. మొత్తంగా నియోజకవర్గ ఇన్‌ఛార్జీల మార్పు అధికార పార్టీలో ప్రకంపనలు సృష్టిస్తోంది. తెలంగాణ ఎన్నికల ఫలితాల తర్వాత వైసిపి అధినేత జగన్ సిట్టింగ్‌లను మార్చడం ద్వారా విజయబావుటా ఎగరేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు అర్థమవుతోందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

ఇక ప్రతిపక్ష టిడిపిలోనూ కొంత గందరగోళం నెలకొంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో పొత్తులో భాగంగా జనసేనకు ఏయే సీట్లు కేటాయిస్తారోననే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. ఆచంట, తణుకు, పాలకొల్లు సీట్లపై ఎటువంటి ఇబ్బందీ లేదు. ఉండి టిక్కెట్ సిట్టింగ్ ఎంఎల్‌ఎ మంతెన రామరాజుకు బదులు మాజీ ఎంఎల్‌ఎ వేటుకూరి వెంకట శివరామరాజు (శివ)కు కేటాయించే అవకాశాలు ఎక్కువ ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. ఇక నరసాపురం, తాడేపల్లిగూడెం, భీమవరం సీట్లలో కనీసం రెండైనా జనసేనకు ఇవ్వక తప్పదని తెలుస్తోంది. ఇదే జరిగితే ఆయా స్థానాల్లో టిడిపి ఆశావహుల పరిస్థితి అగమ్యగోచరంగా మారనుంది. ఏలూరు జిల్లాలో కైకలూరు, ఉంగుటూరు, ఏలూరు, దెందులూరు స్థానాల్లో పెద్దగా ఇబ్బంది లేదు. నూజివీడు, పోలవరం, చింతలపూడి స్థానాల్లో ఆశావహులు ఎక్కువగా ఉండటంతోపాటు గ్రూపుల బెడద కూడా ఉంది. ఈ క్రమంలో చింతలపూడి, పోలవరం నియోజకవర్గాల్లో ఏదోక సీటు జనసేనకు ఇచ్చే అవకాశం ఉందని, అలాగే ఉంగుటూరు, కైకలూరు సీట్లు సైతం జనసేనకు వదిలే అవకాశం ఉందనే ప్రచారం సాగుతోంది. దీంతో ఆయా ప్రాంతాల్లో ఆశావహుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. టిడిపి, జనసేన పొత్తులో జిల్లాలో ఎన్ని సీట్లు జనసేనకు కేటాయిస్తారనేది తేలితే టిడిపి శ్రేణులకు స్పష్టత వచ్చి హుషారుగా పని చేసే అవకాశం ఉందని పరిశీలకులు చెబుతున్నారు. ఏదేమైనా ఎన్నికలు సమీపిస్తున్న వేళ అటు అధికార పార్టీ వైసిపి, ఇటు ప్రతిపక్ష పార్టీ టిడిపిల్లోనూ ఒకింత గందరగోళ పరిస్థితులు ఉన్నాయనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

-విఎస్ఎస్వి.ప్రసాద్

26 నుంచి మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మె

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మున్సిపల్ ఆప్కాస్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనమివ్వాలని, ఇంజినీరింగ్ విభాగం సిబ్బందికి రిస్క్ అలవెన్స్, హెల్త్ అలవెన్స్ అమలు చేయాలని, క్లాప్ ఆటోల డ్రైవర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని కోరుతూ ఈనెల 26వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు నిరవధిక సమ్మె చేపడుతున్నట్లు మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవాధ్యక్షులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.సోమయ్య తెలిపారు. సిఎం జగన ఎన్నికలకు ముందు మున్సిపల్ కార్మికులకు అనేక హామీలిచ్చారని, ఐదేళ్ల పాలన గడుస్తున్నా ఏ ఒక్క హామీ అమలు చేయలేదని తెలిపారు. ఆరు మాసాలుగా ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నప్పటికీ మున్సిపల్ కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆయన విమర్శించారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఈ నెల 26వ తేదీ నుండి సమ్మె చేపడుతున్నట్లు డిసెంబర్ 8న సమ్మె నోటీస్ ఇచ్చామని ఆయన తెలియజేశారు. పర్మినెంట్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, క్లాప్ ఆటోల డ్రైవర్లు, ఇంజనీరింగ్ విభాగం కార్మికులు, స్కూల్ స్వీపర్లు మున్సిపాలిటీల్లో పనిచేసే అన్ని విభాగాల ఉద్యోగులు, కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. అయినా ప్రభుత్వం ఏ సమస్యనూ పరిష్కరించడం లేదని, కార్మికులు విసిగివేసారిపోయారన్నారు. ఈ సందర్భంగా వివిధ సర్కిళ్లలో మున్సిపల్ కార్మికులతో మస్టర్ పాయింట్ల మీటింగులు, ప్రదర్శనలు నిర్వహించినట్లు తెలియజేశారు. క్లాప్ ఆటోల డ్రైవర్లు మూడు రోజులుగా మున్సిపల్ ఆఫీసు వద్ద దీక్షలు చేపట్టారని, నగరంలోని 16 సర్కిళ్లలో కార్మికులు జనరల్ బాడీ సమావేశాలు జరిపి సంతకాల సేకరణ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమానికి యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు లావేటి కృష్ణారావు, కారు దుర్గారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.జాన్‌బాబు, యూనియన్ నాయకులు బంగారు వెంకటేశ్వరరావు, తానంకి జార్జి, పంతం నాగరాజు, గోపి ఏసురత్నం, రమేష్, బండి రాజు, కాళిదాసు, వినుకొండ రమేష్, ఏసునాథ్, సోమేశ్వరరావు కానూరు సత్యనారాయణ, శివ, సత్యవతి, పాప, మరియమ్మ, జోస్ఫిన్, కాంతమ్మ, సునీత, విమల కుమారి, రాణి, నారాయణమ్మ, రవణమ్మ, భాగ్యలక్ష్మి నాయకత్వం వహించారు.

విద్యార్థులకు అంబేద్కర్ ఆదర్శం

ప్రజాశక్తి - చింతలపూడి

డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌ని ప్రతి ఒక్క విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలని మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ బొడ్డు ఇమ్మానుయేలు అన్నారు. చింతలపూడి మండలం ప్రగడవరంలో సాంఘిక సంక్షేమ ప్రభుత్వ వసతి గృహంలో ఉన్న విద్యార్థులకు వాలీబాల్ కిట్లు, రూ.35 వేల విలువ గల టివిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థాయికి వెళ్లాలన్నారు. విద్యార్థులు ప్రశ్నించే తత్వం అలవార్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కాకర్ల సత్యం, సిమోను, వార్డెను పాల్గొన్నారు.

ఉచిత కుట్టు శిక్షణా కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి మండలంలోని పరింపూడిలో ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించారని, గ్రామీణ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు బొల్లిన నిర్మల కిషోర్, ఉమెన్ రైట్స్ అధ్యక్షురాలు గంగిరెడ్ల మేఘాల దేవి, టిడిపి జిల్లా మహిళా అధ్యక్షురాలు చింతల వెంకటరమణ తెలిపారు. శనివారం నిర్వహించిన ప్రారంభ కార్యక్రమంలో బిజెపి ప్రధాన కార్యదర్శి కట్టా సత్యనారాయణ, మండల బిజెపి అధ్యక్షుడు బొమ్మ బాబు, మహిళా ఉపాధ్యక్షురాలు తమ్మిశెట్టి మల్లీశ్వరి పాల్గొన్నారు.

నాగేంద్ర స్వామి ఆలయంలో అన్నదానం

భీమడోలు : పొలసానిపల్లిలోని అతి పురాతన నాగేంద్ర స్వామి ఆలయంలో సుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవాలు ముగిసిన సందర్భంగా శనివారం అన్న సమారాధన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్పంచి షేక్ రహీమా బేగం హసేన విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని ఆలయం వద్ద నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచి కోట శ్రీనివాసరావుతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ముదినేపల్లి : మండలంలోని బొమ్మినంపాడు గ్రామంలోని కొత్త హరిజనవాడ ప్రాంతంలో శనివారం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది గౌతమ్ కుమార్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. బీజామృతంతో విత్తనశుద్ధి ఉపయోగాలు, కాషాయాల తయారీ విధానం, ఉపయోగాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పలు రైతులు పాల్గొన్నారు.

సరస్వతమ్మ మృతి బాధాకరం

మండవల్లి : కైకలూరు నియోజకవర్గంలోని ప్రతి వ్యక్తిపై ఏసుప్రభు ఆశీస్సులు ఉండాలని కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరావు, ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ ఆకాంక్షించారు. మండలంలోని నందిగామ లంక ముదునూరి రామ బద్రిరాజు సతీమణి కీర్తిశేషులు ముదునూరు సరస్వతమ్మకు నిర్వహించిన ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో వారు శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో ఆప్యాయంగా పలకరించే సరస్వతమ్మ మృతి చెందడం బాధాకరమని అన్నారు. అనంతరం ముదునూరి సూర్యనారాయణ రాజు అల్లుడు సయ్యపరాజు గుర్రాజు సరస్వతమ్మ జ్ఞాపకార్థం అందించిన చీరలను వారి చేతుల మీదుగా గ్రామంలోని ప్రజలకు అందించారు. అనంతరం గ్రామస్తులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి నేతల నాగరాజు, ముంగర మల్లికార్జునరావు, భూపతి ప్రవీణ్, దానం పండు పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశి.. పోటెత్తిన యాత్రికులు

ద్వారకాతిరుమల : శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయం శనివారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా భక్తుల గోవింద నామ స్మరణలతో మారుమోగింది. ఉదయం 5 గంటల నుంచి స్వామివారు అమ్మవార్లు ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అధికారులు క్యూ లైన్‌లో భక్తులు ఇబ్బంది పడకుండా మంచినీటి సదుపాయం, పిల్లలకు పాలు సదుపాయం ఏర్పాటు చేశారు. భక్తులకు భోజనాలు ఏర్పాటు చేశామని ఆలయ ఇఒ వేంద్ర త్రినాథరావు తెలిపారు.

పోలవరం : ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా మాజీ ఎంఎల్ఎ మొడియం శ్రీనివాసరావు పాత పట్టిసీమ గ్రామంలోని వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని, ఆ మహావిష్ణువు అనుగ్రహం ప్రజలందరికీ కలగాలని ప్రత్యేక పూజలు వేద పండితులతో జరిపించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ముదినేపల్లి : ముక్కోటి ఏకాదశి సందర్భంగా ముదినేపల్లిలోని పెదరామాలయం సీతారామచంద్రమూర్తి స్వామివారి గ్రామోత్సవం శనివారం నిర్వహించారు. స్వామివారిని ట్రాక్టర్‌పై ఉంచి గ్రామ ప్రధాన వీధుల్లో డప్పు వాయిద్యాలు, మేళ తాళాలు మధ్య ఊరేగింపు చేశారు. అర్చకులు బృందావనం రామ శ్రీనివాసచార్యులు, విశ్వహిందూ పరిషత్ సభ్యులు గోపీనాథ్ పాల్గొన్నారు

వైఎస్ఆర్ బీమా సాయం అందజేత

పోలవరం : మండలంలో పోలవరం పంచాయతీలో శనివారం ఉదయం పిండి వరప్రసాద్ చనిపోవడంతో వారి కుటుంబ సభ్యులకి వైఎస్ఆర్ బీమా తక్షణ సహాయం కింద రూ.10 వేల నగదును జిల్లా ఎంపిపిల ఛాంబర్ అధ్యక్షులు, పోలవరం ఎంపిపి సుంకర వెంకట రెడ్డి, వైసిపి జిల్లా యూత్ జాయింట్ సెక్రెటరీగా పొడుం శ్యాం కుమార్‌ల చేతుల మీదుగా శనివారం అందజేసి ఆ కుటుంబాన్ని పరామర్శించారు. వరప్రసాద్ మృతి ఆ కుటుంబానికి తీరనిలోటని, కుటుంబసభ్యులు మనోధైర్యంతో ఉండాలని ఎంపిపి సుంకర వెంకటరెడ్డి అన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

జంగారెడ్డిగూడెం : రహదారి ప్రమాదాల నివారణకు ఆటో డ్రైవర్లు, ఓనర్లు, ప్రజలకు హెల్మెట్ వల్ల కలిగే ఉపయోగాలు వివరిస్తూ శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జంగారెడ్డిగూడెం సిఐ రాజేష్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ను ధరించడం వల్ల ప్రాణ రక్షణ కలుగుతుందని తెలిపారు. అలాగే హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. రహదారి ప్రమాదాల్లో ఎక్కువగా ద్విచక్ర వాహనదారులు మరణానికి గురవుతున్నారని, వాహనం నడిపే సమయంలో మీపై ఆధారిపడి ఉన్న వారిని గమనించి వేగం వద్దు-ప్రాణం ముద్దని గ్రహించాలన్నారు. ట్రాఫిక్ నియమ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవిఐ శివ ప్రసాద్, పోలీసు సిబ్బంది, పట్టణ ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామ్ సుందర్ అన్నారు. పట్టణంలో జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో మొదటి బహుమతి సాధించిన కె.మహీత, ఎం.శ్రీవర్షిణి అభినంధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడూతూ విద్యార్థుల తమ ప్రతిభను బయటకు తీస్తే ఉత్తమ ఫలితాలు వస్తాయన్నారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు ప్రభాకర్, రవి కూమర్‌ని అభినందించారు. అనంతరం ఎంఇఒ రామారావు, ఎంఇఒ-2 కిరణ్‌బాబు విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు.

నేరాలు - ఘోరాలు

గూటాలలో భారీ చోరీ

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని గూటాల గ్రామంలో శుక్రవారం రాత్రి ఒక ఇంట్లో చోరీ జరిగింది. పోలవరం ఎస్ఐ పవన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం గూటాల గ్రామానికి చెందిన నూకా వరదరాజు ఈనెల 20వ తేదీన పాలకొల్లు గ్రామం సమీపాన ఉన్న బంధువుల ఇంటికి వివాహ రిసెప్షన్‌కు హాజరవ్వటానికి కుటుంబ సమేతంగా వెళ్లగా గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళం బద్దలు కొట్టి ఇంట్లో బీరువాలో ఉన్న 28 కాసుల బంగారు ఆభరణాలు, రూ.6,500 నగదును చోరీ చేశారు. ఈ నెల 22వ తేదీ రాత్రి తిరిగి వచ్చిన వరదరాజు తమ ఇంటి తలుపులు బద్దలు కొట్టి చోరీ జరిగినట్లుగా గుర్తించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుని ఫిర్యాదు మేరకు సంఘటనా ప్రాంతాన్ని సిఐ కె.విజయబాబులతో కలిసి పరిశీలించి, ఏలూరు నుంచి పోలీస్ జాగిలాన్ని రప్పించి చోరీకి సంబంధించిన క్లూలు సేకరించడం జరిగిందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. చోరీ కి గురైన బంగారం శుభకార్యాలలో పాల్గొనడానికి వచ్చిన నూకారపు వరదరాజు తోడల్లుడు మానేపల్లి వెంకటేశ్వరరావుదని ఈ సందర్భంగా ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్కులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

అంగన్వాడీల జీతాల పెంపునకు లేని డబ్బులు.. ప్యాలెస్‌ల నిర్మాణాలకెక్కడివి?

ఏలూరు సమ్మె శిబిరంలో ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరావు

తమ సమస్యల పరిష్కారానికి అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె రోజురోజుకూ ఉధృతం అవుతుంది. పలుచోట్ల అంగన్‌వాడీలు వినూత్న రీతిలో నిరసన తెలియజేస్తున్నారు. 12 రోజులు నుంచి వారు సమ్మె బాటలో ఉంటే ముఖ్యమంత్రి కనీసం స్పందించకపోవడం గమనార్హం..

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అంగన్వాడీలకు జీతాలు పెంచడానికి డబ్బులు లేవు కానీ జగన్మోహన్ రెడ్డి ప్యాలెస్ నిర్మించడానికి మాత్రం ఎక్కడినుంచి వచ్చాయని గ్రాడ్యుట్ ఎంఎల్‌సి వెంకటేశ్వరావు ఎద్దేవా చేశారు. శనివారం చేపట్టిన 12వ రోజు సమ్మెలో ఆయన పాల్గొని మాట్లాడుతూ శిశు సంక్షేమశాఖా మంత్రి ఉష్షశ్రీ మాట్లాడుతూ అంగన్వాడీలకు జీతాలు పెంచడానికి ఇది సమయం కాదు అనడం చాలా దుర్మార్గంగా ఉందన్నారు. మహిళా మంత్రి అయ్యుండి మహిళల సమస్యలు పరిష్కరించకపోవడం బాధాకరమన్నారు. జగన్మోహన్‌రెడ్డి తెలంగాణ కంటే అదనంగా జీతం ఇస్తానని హామీ ఇచ్చి ఐదేళ్లు గడిచినా ఆ హామీ అమలు చేయలేదని విమర్శించారు. అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు కొర్ల విజయలక్ష్మి, అధ్యక్షులు టి.రజినీ, సెక్టార్ లీడర్లు అరుణ కుమారి సిఐటియు నగర అధ్యక్షుడు బి.జగన్నాధ, సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వి.సాయిబాబు పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకులు రాజనాల రామ్మోహన్ రావు మద్దతు తెలిపారు.

చింతలపూడి : అంగన్వాడీల సమ్మెను ప్రభుత్వం విచ్ఛిన్నం చేయాలని చేస్తోందని, ఈ క్రమంలోనే సచివాలయ ఉద్యోగులతో కేంద్రాలను నిర్వహిస్తోందని, ప్రభుత్వ మొండి వైఖరి విడనాడాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి ప్రసాద్ అన్నారు. 12వ రోజు దీక్షలో సరోజిని, శాంతి శ్రీ, వెంకమ్మ, చెన్నకేశ్వరి, శ్యామల, రమాదేవి, పాపారత్నం, జ్యోతి, రాజ్యలక్ష్మి పూర్ణిమా పాల్గొన్నారు.

కలిదిండి : స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 12వ రోజు కొనసాగింది. సమ్మెలో భాగంగా అంగన్వాడీలు రిలే నిరాహారదీక్ష చేపట్టారు. చెవిలో పువ్వులు పెట్టుకొని తమ నిరసన తెలిపారు. అంగన్వాడీల సంఘం నాయకులు షేక్ అబిదా బేగం, జక్కంశెట్టి మేనక లక్ష్మి, కొప్పినీడి రమాదేవి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : అంగన్వాడీల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన నిరవధిక సమ్మె నిరంతరాయంగా కొనసాగుతూ శని వారానికి 12వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఎర్ర కండువాలు మెడలో వేసుకొని రిలే నిరాహార దీక్షను చేపట్టారు. ఈ సమ్మెకు సిఐటియు సంఘం మద్దతు ప్రకటించింది. ఈ కార్యక్రమంలో సి ఐటియు మండల కార్యదర్శి కొండల రావు, అంగన్వాడీ కార్యకర్తలు నాగమణి, ఎస్తేరు, సరళ, జ్యోత్స్న పాల్గొన్నారు.

టి.నరసాపురం : అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన సమ్మెకు సిఐటియు జిల్లా నాయకులు శనివారం సంఘీభావం తెలిపారు. ఎంఆర్‌పిఎస్ నాయకులు సిద్దు కూడా సమ్మె శిబిరానికి విచ్చేసి మద్దతు తెలిపారు.

నిడమర్రు : రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న అంగన్‌వాడీల సమ్మె శనివారం 12వ రోజుకు చేరుకుంది. విఎఎ మండల కమిటీ బృందం అంగన్‌వాడీల సమ్మె శిబిరాన్ని సందర్శించి దేవని విజయలక్ష్మి గరికపాటి మల్లేశ్వరి సంఘీభావం సంపూర్ణ మద్దతు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు పిలిచి సమ్మె విరమింప చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమ్మెలో కె.స్వరూప, సింహాచల వెంకటలక్ష్మి, పిల్లా అరుణ, లక్ష్మి మద్దతు తెలిపారు.

కొయ్యలగూడెం : మండలంలో అంగన్‌వాడీల సమ్మె 12వ రోజుకు చేరింది. ఈ సమ్మెకు కాంగ్రెస్ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పోలవరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి పైడిముక్కల మురళీకృష్ణ, మండల అధ్యక్షులు జి.బాబ్జీ, టౌన్ ప్రెసిడెంట్ నక్క బాబీ, మండల కిసాన్ సెల్ నాయకులు మద్దుకూరి బుచ్చిరాజు, బిసి నాయకులు దారం సత్తిరాజు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు కొడవల పాండు, కుసుం రాజారత్నం, సీతారామయ్య, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శుక్లబోయిన రాంబాబు, అంగన్వాడీ ప్రాజెక్ట్ అధ్యక్షులు శివ రత్నకుమారి, పి.పద్మజ, జె.నాగవేణి, అడపా నాగజ్యోతి, సి.హెచ్.సునీతారాయల్, బొట్టిచి చిట్టి, కె.జ్యోతి, కె.మాధవి, పి.భాగ్యలక్ష్మి, ఎం.వెంకటలక్ష్మి, ఎం.మంగ, శ్రీదేవి పాల్గొన్నారు.

భీమడోలు : మండలంలో అంగన్వాడీల సమ్మె 12వ రోజూ కొనసాగింది. ఈ సమ్మెకు యూనియన్ నాయకులు స్వర్ణ కుమారి, చెల్లామణి నాయకత్వం వహించారు.

ఉంగుటూరు : అంగన్వాడీల సమ్మె శిబిరాన్ని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణరావు సందర్శించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల పట్ల మొండివైఖరి వీడాలని, తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జి.పద్మ, సుజాత, కె.సత్యవతి, ఎం.జాన్సీ, ఎం.శాంతకుమారి, సిహెచ్.అనురాధ ఉన్నారు.

మండవల్లి : అంగన్వాడీల పట్ల ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మొండిగా వ్యవహరించడం సరికాదని అంగన్వాడీలు స్పష్టం చేశారు. తమ న్యాయమైన కోరికలు పరిష్కరించాలని స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద అంగన్వాడీలు నిర్వహిస్తున్న ఆందోళన శనివారం కూడా కొనసాగింది. 12వ రోజు అంగన్వాడీలు ధర్నా చేస్తున్న శిబిరం వద్ద సెమీ క్రిస్మస్ వేడుకను నిర్వహించి, క్యాండిల్ సర్వీస్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ లీడర్లు వాణి చెల్లమ్మ, విజయలక్ష్మి, ఉమాదేవి పాల్గొన్నారు.

నూజివీడు : అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ సమస్యలను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిఐటియు మండల కార్యదర్శి జి.రాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో అంగన్వాడీలు చేస్తున్న సమ్మె శనివారం 12వ రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు పద్మ, ఆదిలక్ష్మి, వసుంధర, జ్యోతి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

చాట్రాయి : ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర సమయంలో అంగన్వాడీలకు తెలంగాణా కంటే ఎక్కువ గౌరవ వేతనం ఇస్తానని మాట ఇచ్చారని, ఆ మాటను ఇప్పుడు మర్చిపోయారని అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు ముఖ్యమంత్రికి గుర్తు చేశారు. చాట్రాయి జిల్లా పరిషత్ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబులు పంపిణీ చేయడానికి వస్తున్న నూజివీడు ఎంఎల్ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావుకు వినిపించే విధంగా నినాదాలు చేసినా కనీసం పట్టించుకోకుండా వెళ్లిపోయారని వాపోయారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు జ్యోతి, పద్మ, రాణి, నాగేశ్వరమ్మ సిఐటియు నాయకులు మేడేపల్లి హెూలీ మేరీ పాల్గొన్నారు.

బుట్టాయిగూడెం : అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తలపెట్టిన నిరవధిక సమ్మెకు 12వ రోజు మండలంలోని కొంతమంది ఆశా వర్కర్స్ మద్దత్తు తెలియజేశారు. అంగన్వాడీలు వంటావార్పు చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు నాగమణి, రామలక్ష్మి, రామయ్యమ్మ, కృపామణి, నూర్జహాన్, మున్ని, ఆకాశమ్మ పాల్గొన్నారు.

ముదినేపల్లి : తమ సమస్యల పరిష్కారం కోరుతూ స్థానిక తహశీల్దార్ కార్యాలయ సమీపంలో చేపట్టిన అంగన్వాడీ కార్యకర్తల సమ్మె శనివారంతో 12వ రోజుకు చేరింది. అంగన్వాడీలు నిర్వహిస్తున్న సమ్మెకు తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి చలసాని జగన్మోహన్‌రావు తమ సంఘీభావం తెలిపారు.

ముసునూరు : మండలంలోని ముసునూరు గ్రామ సచివాలయాల వద్ద అంగన్‌వాడీల సమ్మెలో భాగంగా 12వ రోజు మోకాళ్లపై నుంచుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నూజివీడు డివిజన్ ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పల్లిపాము రాజకుమారి మాట్లాడుతూ గత 12 రోజుల నుంచి నిరసనలు, రాస్తారోకోలు చేపడితే ముఖ్యమంత్రి కనీసం మా సమస్యలపై మాట్లాడకపోవడం గమనర్హమని వాపోయారు. ఈ కార్యక్రమంలో దుర్గ, శిరీష, లక్ష్మి, విజయలక్ష్మి, మేరి సులోచన, విద్యావతి పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : ఎర్ర కండువాలు వేసుకుని నిరసన తెల్పుతున్న అంగన్‌వాడీలు

ఏలూరు అర్బన్ : అంగన్‌వాడీల మద్దతుగా మాట్లాడుతున్న ఎంఎల్‌సి

కలిదిండి : చెవిలో పువ్వు పెట్టుకుని వినూత్న రీతిలో నిరసన

అగ్రిగోల్డ్ బాధితుల బకాయిలు చెల్లించాలి

జంగారెడ్డిగూడెం : అగ్రిగోల్డ్ బాధితులకు ఇవ్వవలసిన బకాయిలు వెంటనే చెల్లించాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు కెవి.రమణ డిమాండ్ చేశారు. శనివారం అగ్రిగోల్డ్ బాధితులకు ఇవ్వాల్సిన బాకీలు వెంటనే ఇవ్వాలని స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అలాగే ఆర్‌డిఒ అద్దేయ్యకు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా కెవి.రమణ, ఇఫ్టూ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.రామ్మోహన్, పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు ఇ.భూషణం మాట్లాడుతూ రాష్ట్రంలో పేద, మధ్య తరగతి వర్గాలు వారి డబ్బును అగ్రిగోల్డ్, అక్షయ గోల్డ్‌లో దాచుకున్నారని తెలిపారు. ఆనాడు రాష్ట్ర ప్రభుత్వ అండతో జరిగిన ప్రచారంతో ప్రజలు నమ్మి లక్షలాది రూపాయలు సొమ్మును దాచుకున్నారని తెలిపారు. ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే రానున్న రోజుల్లో ఆందోళన ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు నాయకులు బన్నే వినోద్, వాసుబోయిన శ్రీను పాల్గొన్నారు.


కలెక్టర్‌చే డాక్టరేట్ అందుకుంటున్న గాంధీ

గాంధీకి గౌరవ డాక్టరేట్

జంగారెడ్డిగూడెం : పట్టణానికి చెందిన సంఘ సేవకులు, రెడ్‌క్రాస్ శాశ్వత సభ్యులు, ఫ్రైడ్ ఇండియా డైరెక్టర్ పిఎస్ఎస్ గాంధీకి గౌరవ డాక్టరేట్ లభించింది. ఇటీవల ఢిల్లీలోని మ్యాజిక్ ఆర్ట్స్ యూనివర్సిటీ గాంధీ చేసిన వెయ్యికి పైగా సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పొందుపరిచి గౌరవ డాక్టరేట్ అందజేయడం జరిగిందని ఆయన తెలిపారు. కోవిడ్, ప్రకృతి విపత్తులు, వరదల సమయంలో విశేష సేవలందించారు. పిఎస్ఎస్ గాంధీకి డాక్టరేట్ లభించడంపై స్థానిక ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గాంధీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా, జిల్లా స్వచ్ఛంద సంస్థల కన్వీనర్‌గా పనిచేస్తున్నట్లు తెలిపారు.

'ఆడుదాం ఆంధ్రా' విజయవంతం చేయాలి

ఎంపిడిఒ సిహెచ్.పద్మావతి

ప్రజాశక్తి - భీమడోలు

మండలంలో ఈనెల 26వ తేదీ నుంచి ప్రారంభమయ్యే 'ఆడదాం ఆంధ్రా' టోర్నమెంట్-2023ను విజయవంతం చేయాలని ఎంపిడిఒ సిహెచ్.పద్మావతి దేవి కోరారు. భీమడోలు హైస్కూల్‌లో శనివారం కార్యక్రమ నిర్వహణపై బాధ్యులతో ఎంపిడిఒతో పాటు, తహశీల్దార్ ఎం.ఇందిరాగాంధీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలోని 17 గ్రామ సచివాలయాల నుంచి ఆటల్లో పాల్గొనేందుకు 1,980 మంది పురుషులు, 700 మంది మహిళలు తమ పేర్లను నమోదు చేసుకున్నారన్నారు. వారికి ఐదు అంశాలలో వేరువేరుగా వార్డు, గ్రామపంచాయతీ, మండల స్థాయిలో పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనికోసం 170 స్పోర్ట్స్ వాలంటీర్ల నియామకం జరిగిందన్నారు. గ్రామస్థాయిలో క్రీడా మైదానాలు అందుబాటులో లేనందున భీమడోలు హైస్కూల్‌లో ఆరు గ్రామ సచివాలయాలు, పూళ్ళ హైస్కూల్‌లో మూడు గ్రామ సచివాలయాలు, ఆగడాల లంక హైస్కూల్‌లో రెండు గ్రామ సచివాలయాలు, గుండుగొలను హైస్కూల్‌లో నాలుగు గ్రామ సచివాలయాల స్థాయిల్లో ఆటల పోటీలు నిర్వహించనున్నామన్నారు. ఒక్కొక్క గ్రామం నుంచి విభాగాల వారీగా రెండు టీంలు పోటీ పడేందుకు రంగం సిద్ధం చేశామన్నారు. వీరిలో ఉత్తమ ప్రదర్శన చేసిన క్రీడాకారులను ఒక టీంగా చేస్తామన్నారు. వారు మండల స్థాయిలో జరిగే పోటీలకు గ్రామపంచాయతీ ప్రతినిధులుగా హాజరవుతారని తెలిపారు. ఇదే క్రమంలో వార్డు, గ్రామపంచాయతీ స్థాయి పోటీలు ఈనెల 26 నుంచి వచ్చే సంవత్సరం జనవరి 9వ తేదీ వరకు, మండల స్థాయి పోటీలు వచ్చే సంవత్సరం జనవరి 10 నుంచి 23వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. చురుకైన జీవనశైలిని అలవర్చేందుకు, ఆరోగ్యం పట్ల అవగాహన పెంచేందుకు క్రీడా పోటీలు దోహదపడతాయన్న లక్ష్యంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆ తర్వాత అందుబాటులో ఉన్న క్రీడాకారులతో మాక్ ఆటల పోటీలను నిర్వహించారు. ఆపై ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై భీమడోలు పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి భాస్కర్, భీమడోలు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చింతలపూడి : ఆటలు ఆడటం వల్ల శారీరకంగా, మానసిక ఉల్లాసం పెరుగుతుందని చింతలపూడి ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజా అన్నారు. పట్టణంలో మండల పరిషత్ కార్యాలయం నుంచి బోసు బొమ్మ సెంటర్ వరకు ఆడదాం ఆంధ్ర నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ మండలంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా 6 వేల మంది పేర్లు నమోదు చేసుకున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి సాదరబోయిన వరలక్ష్మి, మండల సచివాలయం కన్వీనర్ చల్లా బత్తుల శ్రీనివాసరావు, రాఘవపురం సర్పంచి కొండ్రు వజ్ర కిషోర్, ఎండపల్లి సర్పంచి ఎడ్ల మోహన్ రావు, రేచర్ల సర్పంచి శివరామకృష్ణ, చేతుకూరు జైపాల్, రాఘవపురం సొసైటీ ఛైర్‌పర్సన్ చుండూరు నాగేశ్వరరావు, నిమ్మగడ్డ దుర్గారావు, ఎంపిడిఒ ఎం.మురళీకృష్ణ, ఎంఇఒ-2 కిరణ్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భీమడోలు : ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపిడిఒ

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్థానిక పత్తే బాద్‌లోని రెడ్‌క్రాస్ ఎఎన్ఎం నర్సింగ్ మహిళ కళాశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ బివి కృష్ణారెడ్డి మాట్లాడుతూ క్రిస్మస్ మొత్తం ప్రపంచానికి ఆనందం, శాంతిని తెస్తుందన్నారు. ఈ పండుగ కేవలం క్రైస్తవులకు మాత్రమే పరిమితం కాదని ఆయన తెలిపారు. అనంతర విద్యార్థినులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ నర్సింగ్ కళాశాల ఛైర్‌పర్సన్ బి.పద్మజవాణి, డాక్టర్ నవ్యకళ పాల్గొన్నారు.

నూజివీడు రూరల్ : పట్టణంలోని బాలసదనం బాలికల హాస్టల్‌లో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ చిన్నారి బాలికల మధ్య కేక్ కట్ చేసి స్వీట్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు. నీతి కథల పుస్తకాలు చిన్నారులకు అందించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సిడిపిఒ నూరాణి మాట్లాడుతూ సబ్ కలెక్టర్ అందిస్తున్న సహాయ సహకారాలను అందిపుచ్చుకొని జీవితంలో పైకి ఎదగాలన్నారు. చిన్నారులు ఆటలు ఆడి అలరించారు.

ఆగిరిపల్లి: ప్రేమతత్వమే క్రీస్తుమార్గమని, ప్రతిఒక్కరూ తోటివారి పట్ల ప్రేమానురాగాలు కల్గి వుండాలని నూజివీడు డిఎస్‌పి అశోక్‌కుమార్ గౌడ్ అన్నారు. ఆగిరిపల్లి పోలీస్ స్టేషన్‌లో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన క్రిస్మస్ కేక్‌ను కట్‌చేశారు. ఈ కార్యక్రమంలో సిఐలు బాలసురేష్, మూర్తి, శ్రీనివాసరావు, ఎస్ఐలు చంటిబాబు, లక్ష్మణ్, రామకృష్ణ, కుటుంబరావు పాల్గొన్నారు.

ముదినేపల్లి : మండల కేంద్రమైన ముదినేపల్లిలో శనివారం పలు ప్రయివేట్ పాఠశాలల్లో సెమీ క్రిస్మస్ వేడుకలను విద్యార్థులు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. స్థానిక అన్నవరం రోడ్డులోని ఇండో-సాక్సన్, గౌతమ్ స్కూళ్లలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో విద్యార్థులు అలరించిన క్రిస్మస్ పాటలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రిన్సిపల్స్ ఎంజె.జార్జి, పాల్గొన్నారు.

నాడు-నేడుతో పాఠశాలల అభివృద్ధి

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీలో ఎంఎల్ఎ వెంకటప్రతాప్ అప్పారావు

ప్రజాశక్తి - చాట్రాయి

రాష్ట్ర ప్రభుత్వం నాడు-నేడు ద్వారా పాఠశాలలను అభివృద్ధిపరిచిందని, విద్యార్థులు చదువుకోవటానికి అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందని నూజివీడు ఎంఎల్ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. ఎనిమిదో తరగతి విద్యార్థులకు శనివారం ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్ఎ మాట్లాడుతూ గతంలో ఏ రాష్ట్ర నాయకులు చేయలేని అభివృద్ధి విద్యారంగంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేశారని కొనియాడారు. మండలంలో ఉన్న విద్యార్థులందరూ బాగా చదివి, మంచి మార్కులు తెచ్చుకోవాలని, నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించాలని విద్యార్థులను ప్రోత్సహించారు. నూజివీడులో రూ.26 కోట్లతో ఆసుపత్రి నిర్మాణం జరుగుతుందని, వైద్యరంగంలో ఎనలేని సేవలు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని, క్రీడాకారులకు స్టేడియం నిర్మాణం చేపట్టబోతుందని అన్నారు. మండలంలోని 354 మంది ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేయడం జరిగింది. ఎంపిడిఒ కె.దుర్గాప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ ఛైర్మన్ దేశి రెడ్డి రాఘవరెడ్డి, ఎంపిపి లంక నిర్మల, మండల తహశీల్దార్ సిహెచ్.విశ్వనాథరావు, చాట్రాయి గ్రామ సర్పంచి దామెర ఉష, ఎస్ఐ సిహెచ్.స్వామి పాల్గొన్నారు.

చాట్రాయి: విద్యార్థులకు ట్యాబ్‌లు అందిస్తున్న ఎంఎల్ఎ

టి.నరసాపురం : సాంకేతిక నైపుణ్యాభివృద్ధికి ట్యాబ్‌లు దోహదపడతాయని అప్పలరాజు గూడెం గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ డిఎస్ బి.శంకర రావు అన్నారు. మండలంలోని అప్పలరాజుగూడెం గురుకుల పాఠశాలలో ఎనిమిదవ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను శనివారం పంపిణీ చేశారు. అనంతరం పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ ఉప్పులూరి ప్రసాద్ బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ట్యాబ్‌లను ఉపయోగించుకుని సాంకేతిక నైపుణ్యాన్ని, విజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ యు.ప్రసాద్ బాబు, ఎంపిటిసి సభ్యులు కె.రాం భాస్కర్ రెడ్డి, యుడిసి కామేశ్వర రావు, బాపిరాజు, ఇ.శ్రీనివాస రావు, శ్రీనివాస్, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

మండవల్లి : పేద విద్యార్థులు ఉన్నత చదువులు సహకారం చూసుకునే విధంగా ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ స్థాయిలో విద్యనందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డని కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరావు స్పష్టం చేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు అందించిన ట్యాబుల పంపిణీ కార్యక్రమంలో శనివారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు వారి భవిష్యత్తు మీద నమ్మకం పెంచే స్థాయిలో విద్యను అందించే విధంగా ముఖ్యమంత్రి చర్యలు చేపట్టారని అన్నారు. అనంతరం ఆడదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆటల పోటీలను రిబ్బను కత్తిరించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్, సర్పంచి మెండ జాన్సీ, సర్పంచుల సంఘం అధ్యక్షులు బేతపూడి ఏసేవరాజు, పిఎస్‌పిఎస్ అధ్యక్షులు బొమ్మనపైన గోకర్ణ యాదవ్ పాల్గొన్నారు.

IN THE COURT OF THE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL (PRL DISTRICT JUDGE) AT KOTHAGUDEM
MATOP No. 84 OF 2023
BETWEEN:
Banoth Venkataiah ....Claim Petitioner
AND
Chettumala Manikya Rao and others ....Respondents
NOTICE
To
Chettumala Manikya Rao,
S/o.Devasahayam, age 26 years, Driver of Lorry, No.A-16/TJ-2479, R/o.Malleswaram of Chinthalapudi Mandal, Eluru District,
RESPONDENT NO.1.
Please take the notice that the above case is posted for your appearance on 28-12-2023 at about 10.30 AM. As such, you should appear in person or through an advocate, if fails is appear before the Hon'ble Court the matter will be decided ex-parte.
By order of the court.
Date:28-12-2023
Kothagudem
IMMADI RAVI
Advocate for Petitioner
Kothagudem